క్లుప్తంగా

నేడు విద్యుత్ అంతరాయం

వర్ధన్నపేట : వర్ధన్నపేట పట్టణంలో రోడ్డు వెడల్పు కార్యక్రమంలో భాగంగా పాత విద్యుత్ స్తంభాల తొలగింపు, నూతన విద్యుత్ స్తంభాల ఏర్పాటుతో పాటు విద్యుత్ తీగలు సరిచేయడానికి నేడు(ఆదివారం) ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ ఏడీఈ ప్రశాంత్ తెలిపారు.

చెన్నారావుపేట : రోడ్డు అభివృద్ధి పనులలో భాగంగా నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏఈ జోగానంద్ తెలిపారు. ముగ్దుంపురం, చెన్నారావుపేట ఫీడర్ పరిధిలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

కొనసాగుతున్న డ్రైవింగ్ లైసెన్స్ మేళా



రాయపర్తి : మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఎర్రబెల్లి దయాకర్‌రావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత డ్రైవింగ్ లైసెన్స్ మేళా కొనసాగుతోంది. ఈ సందర్భంగా లైసెన్స్‌ల కోసం వివిధ గ్రామాల నుంచి వచ్చిన వారికి భోజనం అందిస్తుండగా శనివారం బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మూనావత్ నర్సింహానాయక్ వడ్డించారు.

పంట నష్టపరిహారం ఇవ్వాలి



దుగ్గొండి : అకాల వర్షాలతో దెబ్బతిన్న రైతులకు నష్టపరిహారాన్ని ఆలస్యం చేయకుండా వెంటనే అందించాలని యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నరిగె ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండలంలోని మందపల్లిలో ఇంటింటికి కాంగ్రెస్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రూ. 2లక్షలు రుణమాఫీ, ప్రతియేటా రూ.15,000 సాయం అందిస్తామన్నారు. నర్సంపేటలో మాధవరెడ్డిదే గెలుపు అని అందుకు ప్రతీ కార్యకర్త కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రాజేశ్వరాచారి, కొత్తకొండ రవివర్మ, గోర్కటి నవీన్‌కుమార్, కోరె రాజేష్, మదూకర్, రఘుపతి, వెంకన్న, మొగిలి, నర్సయ్య పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు సన్మానం

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండల తహసీల్దార్‌గా విశ్వప్రసాద్ ఇటీవల బాధ్యతలు స్వీకరించారు. కాగా శనివారం సమాచార హక్కు వికాస సమితి జిల్లా అధ్యక్షుడు పూర్ణచందర్, నియోజకవర్గ అధ్యక్షుడు శెట్టి రమేష్ శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం పూలబొకే అందజేశారు.

హనుమాన్ నగర సంకీర్తన



దుగ్గొండి : మండల కేంద్రంలో శ్రీ వేంకటేశ్వర భజన మండలి ఆధ్వర్యంలో శనివారం హనుమాన్ నగర సంకీర్తన నిర్వహించారు. హనుమాన్ దేవాలయం వద్ద ప్రారంభమైన కార్యక్రమం గ్రామ వీధుల గుండా వైభవంగా సాగింది. మహిళలు అధిక సంఖ్యలో మంగళ హారతులతో స్వాగతం పలికారు. పోలోజు లింగమూర్తి, పర్లపల్లి స్వరూప, నర్సయ్య, నాగరాణి, కుమారస్వామి, కరుణ, తిరుపతి, రాజమణి, సదానందం, సంధ్య, బ్రహ్మాచారి, గీత, భిక్షపతి, బాబు, యాదగిరి, నాగరాజు, రాజమౌళి, వీరాచారి, రాములు పాల్గొన్నారు.

వైభవంగా బోనాలు



రాయపర్తి : కాట్రపల్లిలో శనివారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్ట్ చైర్‌పర్సన్ ఉషాదయాకర్‌రావు పాల్గొని బోనం ఎత్తుకొని వచ్చి మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో సర్పంచ్ బోనగిరి ఎల్లయ్య, కుందూరు జయశ్రీరెడ్డి, జయశ్రీ, కుందూరు రమేష్‌రెడ్డి, శ్రీధర్, గిరుక సురేష్, ఉందాటి సతీష్, సోమన్న, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కారోబార్ మృతి


బుచ్చయ్య (ఫైల్)

గీసుకొండ : మండలంలోని విశ్వనాథపురం గ్రామ పంచాయతీ కారోబార్‌గా పని చేస్తున్న వాంకుడోత్ బుచ్చయ్య అనారోగ్యంతో బాధపడుతూ శనివారం మృతి చెందాడు. ఎంపీపీ భీమగాని సౌజన్య, ఎంపీడీఓ వీరేశం, ఎంపీఓ ప్రభాకర్, సర్పంచ్ అంకతి నాగేశ్వర్‌రావుతో పాటు పలు గ్రామాల కారోబార్లు, సర్పంచ్‌లు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. పంచాయతీ నుంచి రూ. 10 వేల సాయాన్ని అంతిమ సంస్కారాలకు ఎంపీడీఓ, ఎంపీఓ అందజేశారు.


నెక్కొండ: అలంకానిపేట హైస్కూల్‌లో మొక్క నాటుతున్న సర్పంచ్


నల్లబెల్లి: కొండాపూర్‌లో మొక్క నాటుతున్న ఎంపీడీఓ విజయ్‌కుమార్


ఖానాపురం: మొక్కలు నాటుతున్న ఏపీడీ, అధికారులు

మొక్కలు నాటి రక్షించాలి

వజ్రోత్సవ కోటి వృక్షార్చనలో భాగంగా జిల్లావ్యాప్తంగా శనివారం మొక్కలు నాటారు. మొక్కలు నాటి రక్షించాలని నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్ పర్సన్లు, కౌన్సిలర్లు, బీఆర్‌ఎస్ నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్


నర్సంపేట: మొక్క నాటి నీరు పోస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి


ఖానాపురం: బుధరావుపేటలో..


దుగ్గొండి: పొనకల్‌లో మొక్కలు నాటుతున్న జెడ్పీ వైస్ చైర్మన్ శ్రీనివాస్, ఎంపీపీ కాట్ల కోమల


నల్లబెల్లి: రాంపూర్‌లో మొక్క నాటుతున్న ట్రైయినీ మిలటరీ ఇంజనీరింగ్ సర్వీస్ అధికారులు


చెన్నారావుపేట: మొక్క నాటుతున్న అధికారులు


రాయపర్తి: కేసీఆర్ కాలనీలో..


సంగెం: మొక్క నాటుతున్న ఎమ్మెల్యే ధర్మారెడ్డి

మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం కృషి

- ఎమ్మెల్యే అరూరి రమేష్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే అరూరి రమేష్

వర్ధన్నపేట : మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించేందుకు, వారు ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని ఎమ్మెల్యే అరూరి రమేష్ అన్నారు. మండలంలోని ఇల్లంద గ్రామంలో శనివారం గ్రామైక్య సంఘాల 10వ వార్షికోత్సవ సభకు ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న వడ్డీ లేని రుణాలు, పావలా వడ్డీ రుణాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇప్పటి వరకు వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలో 1818 మహిళా సంఘాలకు రూ.30 కోట్ల 41 లక్షల 47 వేలు అందించామన్నారు. అదే విధంగా అన్ని నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాల్లో మహిళా సమాఖ్య భవనాలు, ప్రతి గ్రామంలో మహిళా భవనాలు నిర్మిస్తున్నట్లు వివరించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను శాశ్వత కొనుగోలు కేంద్రాలుగా అభివృద్ధి చేసి మహిళల ద్వారా అన్ని రకాల పంటల కొనుగోళ్లు చేపట్టేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అన్నమనేని అప్పారావు, జెడ్పీటీసీ మార్గం భిక్షపతి, సర్పంచ్ సుంకరి సాంబయ్య, ఎంపీటీసీలు శ్రీనివాస్, పిట్టల జ్యోతి మహిళలు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి


నర్సంపేట: ఆర్డీఓ కార్యాలయ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న మీసేవ నిర్వాహకులు


గీసుకొండ: వినతిపత్రం ఇస్తున్న నిర్వాహకులు

నర్సంపేట : తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని మీసేవ కేంద్రాల నిర్వాహకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు డివిజన్‌లోని నర్సంపేట, చెన్నారావుపేట, దుగ్గొండి, నల్లబెల్లి, ఖానాపురం, నెక్కొండ మండలాల మీసేవ కేంద్రాల నిర్వాహకులు శనివారం ఆర్డీఓ కార్యాలయ ఏఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మీసేవ ద్వారా 2017డిసెంబర్ నాటికి రూ.10కోట్ల లావాదేవీలు జరగడంతో ఐటీ రంగానికి కేంద్రస్థాయిలో గుర్తింపు వచ్చిందే తప్ప రూ.10కోట్ల లావాదేవీలు చేసిన వారికి ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. మీసేవ కమీషన్స్ పెంచి మీసేవ ప్రింట్ పేపర్, కరెంట్, ఇంటర్నెట్ బిల్ ఫ్రీగా ఇవ్వాలని కోరారు. సర్వీస్ టాక్స్ మినహాయించి మున్సిపాలిటీ, గ్రామ పంచాయతీలో మీసేవ నిర్వహించడానికి గది డిమాండ్ చేశారు. మీసేవ కుటుంబ సభ్యులకు హెల్త్ ఇన్సూరెన్స్ వర్తింప చేసి కొత్త మీసేవలను ఇవ్వడం ఆపాలని అన్నారు. రైతులకు రుణం పొందేందుకు పహాణీలు, ఆర్‌ఓఆర్, ధరణి సర్వీసెస్‌లు పునరుద్ధరించాలన్నారు. కార్యక్రమంలో డివిజన్‌లోని నర్సంపేట, చెన్నారావుపేట, దుగ్గొండి, నల్లబెల్లి, ఖానాపురం, నెక్కొండ మండలాల మీసేవ కేంద్రాల నిర్వాహకులు సంతోష్‌కుమార్, ఐలయ్య, స్వప్న, లింగయ్య, రాజేందర్, కిశోర్ పాల్గొన్నారు.

గీసుకొండలో..

గీసుకొండ : మీసేవ నిర్వాహకుల సమస్యలను ప్రభుత్వం పరిష్కారించాలని కోరుతూ శనివారం మీసేవ కేంద్రాల నిర్వాహకులు తహసీల్దార్ ఎండీ రియాజుద్దీన్‌కు వినతిపత్రం అందజేశారు. తమకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని మీసేవ నిర్వాహకులు కోట ప్రమోద్, మేకల యాకూబ్, దేవులపల్లి మహేందర్, రాయరాకుల అశోక్ వినతిపత్రంలో కోరారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక


గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

రాయపర్తి : మండలంలోని గట్టికల్ గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాగా శనివారం రాష్ట్ర పంచాయతీ రాజ్ ,గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సమక్షంలో తిరిగి బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. చిన్నాల శ్రీధరయ్య, చిన్నాల వెంకట్రాం, దొనబోయిన రమేష్ ఉన్నారు. జెడ్పీటీసీ రంగు కుమార్‌గౌడ్, ఎలమంచ శ్రీనివాస్‌రెడ్డి, చిన్నాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నర్సంపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో..


పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు

నర్సంపేట : బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై ఎంతో మంది బీఆర్‌ఎస్ పార్టీలో చేరుతున్నారని నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం నర్సంపేట మండలం నాగుర్లపల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీకి చెందిన 30కుటుంబాలు, నెక్కొండ మండలం బంజరుపల్లి కాంగ్రెస్ పార్టీకి చెందిన 40కుటుంబాలు బీఆర్‌ఎస్‌లో చేరారు. పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

కేంద్ర ప్రభుత్వ నిధులు దుర్వినియోగం

- మాజీ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి
- నాణ్యతా లోపంతో జిల్లా ఆస్పత్రి నిర్మాణం


ఆస్పత్రి నిర్మాణ పనులను పరిశీలిస్తున్న రేవూరి

నర్సంపేట : కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న నిధులను రాష్ట్ర ప్రభుత్వం దుర్వినియోగం చేస్తోందని మాజీ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు నర్సంపేటలో నిర్మిస్తున్న 250 పడకల జిల్లా ఆస్పత్రి నిర్మాణ పనులను బీజేపీ నాయకులతో కలిసి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూర్తిగా కేంద్రం ఇచ్చిన నిధులతో నిర్మిస్తున్న నర్సంపేటలోని జాతీయ ఆరోగ్య మిషన్ ఆస్పత్రి భవన నిర్మాణంలో నాణ్యత లోపం కొట్టొచ్చినట్లు కనబడుతోందన్నారు. పిల్లర్లు, బీముల నిర్మాణంలో సాంకేతికపరమైన అంశాలను పట్టించుకోలేదన్నారు. నాణ్యత లోపంతో కూడుకున్న నిర్మాణ విషయమై ఆరోగ్య శాఖ మంత్రి హరీష్‌రావు టెక్నికల్ బృందంతో తనిఖీ చేయించి నిజాయితీ నిరూపించుకోవాలని ప్రకాశ్‌రెడ్డి డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ నర్సింహరాములు, రేసు శ్రీనివాస్, చిలువేరు రజనిభారతి, బాల్నె జగన్, గుంటి వీరప్రకాశ్, గూడూరు సందీప్, తదితరులు పాల్గొన్నారు.

సభను విజయవంతం చేయాలి


నర్సంపేట: పాల్గొన్న ఐక్యవేదిక నాయకులు


నెక్కొండ: సమావేశంలో మాట్లాడుతున్న రమేష్

నర్సంపేట : నర్సంపేట పట్టణంలోని సిటిజన్ క్లబ్‌లో నేడు(ఆదివారం) నిర్వహించే గద్దర్ యాది సభకు రాజకీయ పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరూ హాజరై విజయవంతం చేయాలని గద్దర్ యాది సభ ఐక్య వేదిక కన్వీనర్‌లు కోరారు. ఈ మేరకు గద్దర్ యాది సభ విజయవంతం చేయాలని ప్రజా సంఘాలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, విద్యార్థి సంఘాల బాధ్యులు శనివారం పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌లో ర్యాలీ చేపట్టారు.

గద్దర్ యాది సభ

నెక్కొండ : తెలంగాణ ఉద్యమంలో గద్దర్ పాత్ర చిరస్మరణీయమని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పంజాల రమేష్ అన్నారు. మండల కేంద్రంలో శనివారం గద్దర్ యాది సభలో పాల్గొని గద్దర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదల పక్షాన నిలబడి సమస్యల పరిష్కార మార్గాన్ని ఎంచుకొని నిరంతరం పోరాటం చేసిన యుద్ధ నౌక గద్దర్ అని కొనియాడారు. కార్యక్రమంలో ప్రజా నాట్య మండలి జిల్లా అధ్యక్షుడు దామెర కృష్ణ, ఏఐయూసీ జిల్లా కార్యదర్శి గన్నారపు రమేష్, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మియాపురం గోవర్ధన్‌చారి, సీపీఐ మండల కార్యదర్శి కందిక చెన్నకేశవులు, నాయకులు ఎల్లస్వామి, దేవపాల, యాదయ్య, ఉప్పలయ్య, ఐలయ్య, రజిత, శ్రీలత, వెంకటలక్ష్మి, వీరస్వామి, రాధ పాల్గొన్నారు.

ఓటరు జాబితాలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు


పోలింగ్ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఆర్డీఓ కృష్ణవేణి

నెక్కొండ: ఓటరు జాబితా తయారీలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని నర్సంపేట ఆర్డీఓ కృష్ణవేణి హెచ్చరించారు. మండలంలో ని పలు పోలింగ్ కేంద్రాలను శనివారం ఆర్డీఓ సందర్శించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పారదర్శకమైన ఓటరు జాబితా రూపకల్పనకు అందరూ సహకరించాలన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో శని, ఆదివారాల్లో అందుబాటులో ఉండి కొత్త ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పుల కోసం వచ్చే దరఖాస్తులను స్వీకరించాలన్నారు. సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు పోలింగ్ కేంద్రాలను సందర్శించి సౌకర్యాలు, సమస్యలపై నివేదిక సమర్పించాలని ఆమె ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజ్‌కుమార్, ఆర్ఐ నరేందర్, బీఎల్‌ఓలు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు నెరవేర్చాలి

- బీఆర్‌ఎస్ లోఫర్‌ల మాటలు ప్రజలు నమ్మే రోజులు పోయాయి
- దళిత, బీసీ బంధు, యాంత్రీకరణ అంటూ ఎమ్మెల్యే మాయమాటలు
- ఎమ్మెల్యే పెద్దిపై ధ్వజమెత్తిన మాజీ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న మాధవరెడ్డి

నర్సంపేట రూరల్ : బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎన్నికల హామీలు మరిచిందని, సీఎం కేసీఆర్ తుపాకి రాముడిలా మాట్లాడుతూ.. ప్రజలను మభ్యపెట్టేందుకు చూస్తున్నారని రానున్న ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పి కాంగ్రెస్ పార్టీని ఆదరించాలని ఏఐసీసీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి కోరారు. నర్సంపేట మండలంలోని కమ్మపల్లి గ్రామంలో మండల స్థాయి బూత్ సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా దొంతి మాధవరెడ్డి హాజరై మాట్లాడారు. కేసీఆర్ ఎన్నికల సమయంలో హామీలు ఇస్తూ దళితబంధు, బీసీ బంధు, మైనార్టీ బంధు అంటూ మోసం చేస్తున్నాడని అన్నారు. దారి తప్పి గెలిచిన నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అసలు ప్రతిపక్షమే లేదంటూ విమర్శిస్తున్నారని, దమ్ము, ధైర్యం ఉంటే ఎన్నికల్లో ఇచ్చిన హామీలని నెరవేర్చాలన్నారు. ఇచ్చిన హామీలను మరిచి సిగ్గు, శరం లేకుండా గ్రామాల్లో ఎలా తిరుగుతున్నారని ప్రశ్నించారు. ఎన్నికల వేళ అధికార పార్టీ లోఫర్‌లు ప్రజలను మభ్యపెట్టేందుకు గ్రామాల్లోకి వస్తున్నారని, వారి మాటలను నమ్మకుండా ప్రజలను చైతన్యం చేస్తూ కార్యకర్తలు సైనికుల్లా పనిచేసి కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం కృషి చేయాలన్నారు. రెండు రోజులుగా నర్సంపేట వ్యవసాయ మార్కెట్ యాంత్రీకరణ పేరుతో రైతులకు ట్రాక్టర్లు, రోటోవేటర్లు, పనిముట్లు, పరికరాలు ఇస్తున్నామని గొప్పలు చెబుతున్నారని దుయ్యబట్టారు. కలెక్టర్, మండల స్థాయి అధికారులు సైతం అధికార పార్టీ ఏం చెబితే అదే చేస్తున్నారని, దీన్ని ప్రశ్నిస్తే పట్టించుకునే వారే కరువయ్యారన్నారు. వీటిని ప్రజలకు వివరించాల్సిన కొంతమంది రిపోర్టర్లు కూడా అధికార పార్టీకి వత్తాసులు పలుకుతున్నారని తీవ్రస్థాయిలో విమర్శించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బానోత్ లక్ష్మణ్, పీసీసీ సభ్యులు పెండెం రామానంద్, సొంటిరెడ్డి రంజిత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మహిళా జిల్లా అధ్యక్షురాలు కర్నాటి పార్వతమ్మ, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వేముల సాంబయ్య, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, ఆయా గ్రామాల అధ్యక్షులు, కన్వీనర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు ఎంపిక


విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

వర్ధన్నపేట: వర్ధన్నపేటలోని ఇల్లంద ప్రభుత్వ పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న బొల్లం మణికంఠ, కొలిపాక సాత్విక రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం విజయ తెలిపారు. ఇటీవల జిల్లా యోగాసన అసోసియేషన్ ఆధ్వర్యంలో వరంగల్ కాశిబుగ్గ వివేకానంద విద్యాలయంలో నిర్వహించిన పోటీల్లో ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి కి ఎంపికయ్యారు. ఉపాధ్యాయులు అభినందించారు.

సంక్షిప్త సమాచారం

దివ్యాంగులకు పింఛన్ల పంపిణీ



ఖానాపురం : దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు అన్నారు. ఈ మేరకు మండల కేంద్రంలో శనివారం పెంచిన పింఛన్లను పంపిణీ చేశారు. బీఆర్‌ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ దాసరి రమేష్, వెన్ను సమ్మయ్య, వీరన్న, పోస్టుమాస్టర్ అఫ్రోజ్ పాల్గొన్నారు.

న్యాయం చేయాలి

సంగెం : కాపులకపర్తి సబ్‌డివిజన్ ఏడీఈ నర్సింహరావును అన్‌మ్యాన్డ్ కార్మికులు శనివారం కలిశారు. ఈ సందర్భంగా నాయకులు శ్యామ్, వినోద్, కొమురెల్లి, సుదన్ మాట్లాడుతూ.. హైదరబాద్‌లోని ఎస్‌డీపీఎల్‌లో పనిచేస్తున్న వారిని పర్మనెంట్ చేశారని, ఎస్పీడీసీఎల్‌లో పదేళ్లుగా పనిచేస్తున్నా మమ్ముల్ని ఎందుకు పర్మనెంట్ చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకునివెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఏడీఈ నర్సింహరావు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సంగెం, కాపులకనిపర్తి, మచ్చాపూర్ సెక్షన్ల పరిధిలోని అన్‌మ్యాన్డ్ కార్మికులు మురళీకృష్ణ, భాస్కర్, రమేష్, రాజు, కొమ్మాలు, వంశీ తదితరులు పాల్గొన్నారు.

పురుగుల ఉధృతిని తగ్గించుకోవాలి

పర్వతగిరి : పత్తి పంటలో పురుగుల ఉధృతిని తగ్గించుకోవడానికి రైతులు చర్యలు చేపట్టాలని పీయూ మేనేజర్లు శ్రీధర్, హిమవర్షిణి అన్నారు. ఈ మేరకు మండలంలోని పర్వతగిరి, నారాయణపురం గ్రామ పరిధిలోని కంబాలకుంట తండాలో ప్రజ్వల్ ఎఫ్‌పీసీఎల్, డబ్ల్యూడబ్ల్యూఫ్–బీసీఐ ప్రాజెక్టు రైతులకు శనివారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పత్తి పంటలో వచ్చే చీడ పీడలు, రసం పీల్చే పురుగులు, కాయ తొలుచు పురుగు నష్ట పరిమితి స్థాయిలను రైతులకు వివరించారు.

కొండేటి శ్రీధర్ పరామర్శ



వర్ధన్నపేట : వర్ధన్నపేట మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు మాశెట్టి సోమయ్య సతీమణి హైమావతి(64) ఇటీవల గుండెపోటుతో మృతి చెందింది. కాగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్ శనివారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. శ్రీధర్‌తో పాటు పెద్దూరి రాజు, ఐత రవికుమార్, మల్లెపాక అనిల్, బొంపెల్లి దేవేందర్‌రావు, విక్రమ్, కేదారి ఉన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



ఖానాపురం : మండలంలోని అశోక్‌నగర్‌కు చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు ఉపేందర్‌రెడ్డి తల్లి అనారోగ్యంతో ఇటీవల మృతి చెందింది. కాగా నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి శనివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. మృతురాలి చిత్ర పటం వద్ద నివాళులర్పించారు.

పెద్ది స్వప్నను పరామర్శించిన నాయకులు

చెన్నారావుపేట : ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన జెడ్పీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్నను ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం ఎల్లాయగూడెం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు, తెలంగాణ రాష్ట్ర ఉద్యమ కారుడు బోడ అరుణ్‌కుమార్, మాజీ జెడ్పీటీసీ జున్నూతుల రాంరెడ్డి పరామర్శించారు.

అంత్యక్రియలకు సాయం

గీసుకొండ : మండల కేంద్రానికి చెందిన మేకల మోహన్ అనారోగ్యంతో మృతి చెందాడు. శనివారం అతడి అంత్యక్రియలకు అవసరమైన సాయాన్ని కుటుంబ సభ్యుల వద్ద లేకపోవడంతో గ్రామానికి చెందిన స్టేట్ బ్యాంకు రిటైర్డ్ మేనేజర్ పెగళ్ళపాటి లక్ష్మినారాయణ రూ. 5వేల నగదు అందజేశారు. ఈ సాయాన్ని సర్పంచ్ దౌడు బాబు, రాంమూర్తి బాధిత కుటుంబ సభ్యులకు అందించారు.

గీత కార్మికుడికి..

సంగెం : మండలంలోని పల్లారుగూడకు చెందిన గీతకార్మికుడు మోడెం రమేష్ ఇటీవల మృతి చెందాడు. కాగా శనివారం గౌడ సంఘం పాలకవర్గం ఆధ్వర్యంలో అధ్యక్షుడు, సర్పంచ్ కక్కెర్ల కుమారస్వామి బాధిత కుటుంబానికి రూ.10వేల సాయం అందజేశారు. కార్యక్రమంలో బొమ్మ కోటేశం, జూలూరి అశోక్, డైరెక్టర్లు బొల్లికొండ శివ, చీకటి కృష్ణ, చిరంజీవి, సాంబయ్య, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.